www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 18 ఫిబ్రవరి 2025





కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఎపి రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు



రాయచోటి : ఐసిడిఎస్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

కదంతొక్కిన అంగన్వాడీలు

మినీ అంగన్‌వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలని, ధరలకనుగుణంగా వేతనాలు పెంచాలని కోరుతూ జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీలు సోమవారం కదంతొక్కారు. ర్యాలీలు, కలెక్టరేట్, సిడిపిఒ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించారు. అంగన్‌వాడీ వర్కర్లకు, హెల్పర్లకు, మినీ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా గుర్తించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన ఈ కార్యక్రమం చేపట్టారు.

- మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలి
- సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలి
- కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి
- ర్యాలీలు, కలెక్టరేట్, సిపిడిఒ కార్యాలయాల వద్ద ధర్నా
- వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

అంగన్వాడీలు 42 రోజుల చారిత్రాత్మక సమ్మె డిమాండ్లను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని అంగన్వాడీ ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి భాగ్యలక్ష్మి అన్నారు. సోమవారం అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు రాయచోటి ప్రాజెక్టు కార్యాలయం దగ్గర ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల ముందు అంగన్వాడీలు 42 రోజులు సమ్మె చేసినప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అంగన్వాడీల సమస్యలు పరిష్కరిస్తామని, సంతృప్తి చెందే విధంగా జీతాలు పెంచుతామనని చెప్పిన కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత దాని ఊసే ఎత్తడం లేదని వాపోయారు. 2022 ఏప్రిల్ 25న సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యూటీ రూ.5 లక్షలు ఇవ్వాలని మినీ వర్కర్ మెయిన్ వర్కర్‌గా చేయాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టులో ఉన్న చాలామందికి జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని, దీనిపై అనేకమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని తెలిపారు. వర్కర్ల సమస్యలను నిర్లక్ష్యం చేస్తున్నారని, దిగువ రాజుగారిపల్లెకు రెండేళ్లుగా హెల్పర్ రాక పోయినా ఆమెపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నిం చారు. చిన్నమండెం, మల్లూరు, సంబేపల్లి సెక్టార్లలో కొన్ని సెంటర్లకు గ్యాస్ సిలిండర్లు లేవని, వెంటనే అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేకపోతే ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి బంగారుపాప, నాయకులు అరుణ, విజయ, షబీనా, సుమలత, సురేఖ, పద్మజా, శంకరమ్మ, జయమ్మ, లక్ష్మీదేవి, షబానా, శైలజ, జలజ, అంజలి, శ్రీదేవి, కళా, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి:** ఏడేళ్లలో నిత్యావసర సరుకుల ధరలు 70 రెట్లు పెరిగి, తీవ్ర పనిభారం మోపి, జీతాలు పెంచకుంటే అంగన్వాడీలు ఎలా జీవిస్తారని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. స్థానిక పాత ఐసిడిఎస్ ఆఫీస్ ఎదుట లక్కిరెడ్డిపల్లి ప్రాజెక్ట్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్.ఓబుళమ్మ అధ్యక్షతన జరిగిన ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హామీలను అమలు చేయడంలో టిడిపి కూటమి ప్రభుత్వం జాప్యం సరికాదని తెలిపారు. యాప్‌ల భారం తగ్గించి, రాజకీయ ఒత్తిడికి తలొగ్గి, అర్హులైన హెల్పర్స్‌కు ప్రమోషన్‌లు ఇవ్వని సిడిపిఒల మీద చట్ట మైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలకు ప్రస్తుతం రెండు రోజుల పని ఒకే రోజు చేయమని పని భారం పెంచుతుంటే హెల్పర్, వర్కర్‌ల పనిని మినీ వర్కర్స్ మోయలేకున్నారని రిటైర్ మెంట్ బెనిఫిట్స్ గ్రాట్యూటీ ఇవ్వాలన్నారు. అధికార, రాజకీయ వేధింపులు, బెదిరింపులని నిరోదించాలన్నారు. అంగన్వాడీ, ఆశా మధ్యాహ్న భోజన పతక స్కీం వర్కర్లకి జీతాల్లేవు అంటున్నార, ఇంటికి 5 కంటే వారి భవిష్యత్ ఏంటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్షులు జె.సుకుమారి మాట్లాడుతూ సెంటర్ నిర్వహణలో అంగన్వాడీలు అప్పులు చేస్తూ, టెన్షన్‌లతో అనారోగ్యాలతో చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ పతకాలు అమలు చేయాలని పెండింగ్‌లోని బిల్లులు జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సూపర్వైజర్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. రికార్డులు ప్రభుత్వమే ఇవ్వాలని సకాలంలో వేతనాలు బిల్లులు ఇచ్చి అంగన్వాడీలను ఆదుకోవాలని తెలిపారు. సమ్మె కాలపు హామీలను తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రంని క్లర్క్ గణేష్‌కు అందజేశారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ నాయకులు సి.ప్రభావతి, రెడ్డెమ్మ, చిట్టెమ్మ, శారద, నాగవేణి, మణి, శోభ, రుక్మిణి, లక్ష్మి ప్రసన్న పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** స్థానిక సిడిపిఒ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు ధర్నా, నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షులు మధురవాణి మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలపై రాజకీయ వేధింపులు, ఒత్తిడులు పెరిగాయని విమర్శించారు. అనంతరం సిడిపిఒకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి హరీంద్రనాథ్‌శర్మ, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, ఐద్వా జిల్లా కన్వీనర్ భాగ్యమ్మ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు నరసింహ, సిఐటియు నాయకులు, అంగన్వాడీలు పాల్గొన్నారు. **బి.కొత్తకోట :**అంగన్వాడీల న్యాయపరమైన సమస్యలను పరిష్కరిం చాలని కోరుతూ సిడిపిఒకు అంగన్వాడీలు వినతి పత్రం అందజేశారు. అంగన్వాడీలకు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. తొమ్మిది న్యాయపరమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని సిడిపిఒకు వినతిపత్రం అందజేశారు. **రాజంపేట అర్బన్ :** అంగన్వాడీలకు రూ.వెయ్యి వేతనం పెంచాలని గత వైసిపి ప్రభుత్వం ఇచ్చిన జీవోను ప్రస్తుత కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవి కుమార్ డిమాండ్ చేశారు. అంగన్వాడీలకు వేతనం పెంచాలని కోరుతూ ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్యకర్తలు ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు ఈశ్వరమ్మ, శివరంజని, అమరావతి, రాజేశ్వరి, ఇందుమతి, వనిత, విజయ పాల్గొన్నారు. **రైల్వేకోడూరు:** అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, గ్రాడ్యుటి అమలు చేయాలంటూ ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ఎపి అంగన్వాడీలు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్షులు ఎన్.శ్రీరమా దేవి, జిల్లా అధ్యక్షులు ఎస్.శ్రీలక్ష్మి, కోశాధికారి జి.పద్మ, వర్కింగ్ ప్రెసిడెంట్ టి.రాధాకుమారి, సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.చంద్రశేఖర్, మండల నాయకులు జాన్ ప్రసాద్ అంగన్వాడీలు పాల్గొన్నారు.



లక్కిరెడ్డిపల్లి : ఐసిడిఎస్ కార్యాలయం నినాదాలు చేస్తున్న అంగన్వాడీలు



రైల్వేకోడూరు : మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్



మదనపల్లె : సిడిపిఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్వాడీలు



రాజంపేట : నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

'ముదివేడు' నిర్వాసితులకు
నష్టపరిహారం చెల్లించాలి

- ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ముదివేడు రిజర్వాయర్ నిర్వాసితులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదురుగా రైతు సంఘం నాయకులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కోసం జిల్లాలోని కురబలకోట మండలం దీన్నేమీదపల్లి గ్రామంలో సుమారు 300 మంది రైతులు 780 ఎకరాల భూమిని కోల్పోతున్నారని పేర్కొన్నారు. భూమిలో వ్యవసాయం చేస్తూ సంవత్సరంలో రెండు, మూడు పంటలు పండించుకొని రైతులు తమ కుటుంబాన్ని పోషించుకుంటున్నారన్నారు. రైతుల భూములను బలవంతంగా తీసుకొని నష్టపరిహారం అంది స్తామని చెప్పి ఎలాంటి నష్టపరిహారం అందించకుండా కాల యాపన చేస్తున్నారని పేర్కొన్నారు. నిరసన తెలియజే యడానికి వచ్చిన రైతులను నిర్బంధించి దౌర్జన్యం చేస్తున్నారని మండిపడ్డారు. ఒకపక్క ప్రాజెక్టు భూములు కోల్పోయి పనులు లేక, ప్రభుత్వం నష్టపరిహారం అందకపోవడంతో కుటుంబాలు గడవక పిల్లలను చదివించుకోలేని దుస్థితి ఏర్పడుతుందని వాపోయారు. ఈ విషయంపై అనేకసార్లు ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ భూములు, ఇల్లు కోల్పోయిన రైతులకు వెంటనే 2013 భూ సేకరణ చట్టం ప్రకారం భూమికి భూమి ఇచ్చి పరిహారం ఇవ్వాలని, ఇల్లు పున నిర్మాణం చేసి ముదివేడు రిజర్వాయర్ నిర్వాసితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ శ్రీధర్ చామకూరికు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.శ్రీనివాసులు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.రామచంద్ర, నాయకులు వెంకట రమణారెడ్డి, రమేష్ బాబు, రాజేష్, సురేంద్రరెడ్డి, మగ్దూం బాషా, వేణు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడులను అరికట్టాలి

- జర్నలిస్టు సంఘాల ఐక్య వేదిక నాయకుల డిమాండ్

ప్రజాశక్తి - కడప అర్బన్

జర్నలిస్టులపై దాడులను అరికట్టాలని, పార్వతీపురం మన్యం జిల్లా మకువా మండల ప్రజాశక్తి విలేకరి రామారావుపై దాడి చేసిన టిడిపి మండల నాయకుడు వేణు గోపాల్ నాయుడును వెంటనే అరెస్టు చేయాలని జర్నలిస్టు సంఘాల ఐక్య వేదిక నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ప్రజా పరిష్కారాల వేదికలో డిఆర్ఓ విశ్వేశ్వర నాయుడుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎపిడబ్ల్యుజె జిల్లా అధ్యక్షులు రామసుబ్బారెడ్డి, వీడియో అండ్ ఫోటో జర్నలిస్ట్ యూనియన్ జిల్లా అధ్యక్షులు చెరుకూరి శ్రీనివాసులు, ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రమోహన్‌రాజు, మన్నూరు నూరుబాషా, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా గౌరవాధ్యక్షులు భూమిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెంటనే స్పందించి దాడి చేసిన వేణుగోపాల్ నాయుడుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో భాగంగా రోడ్డు పనుల దగ్గరికి వెళ్లిన విలేకరిని దుర్భాషలాడి చేయి చేసుకోవడం దారుణమని పేర్కొన్నారు. చంపుతానని, భార్యా బిడలకు దూరమవుతావని బెదిరించడం సమంజసం కాదని చెప్పారు. 'మిగిలినవారు మౌనంగా ఉంటే నువ్వు ఎవడివిరా రాస్తావు' అంటూ పూనకం వచ్చిన తరహాలో రెచ్చిపోవడం అందరూ గమనించారని తెలిపారు. అసాంఘిక, అనాగరిక శక్తులను అదుపులోకి తీసుకుని పత్రికా స్వేచ్ఛను కాపాడాలని కోరారు. విలేకరి ప్రాణానికి భద్రత కల్పించడంతోపాటు దాడి ఘటనకు సంబంధించి న్యాయం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జర్నలిస్టు సంఘాల నాయకులు రామానుజులరెడ్డి, శ్రీనివాసులు, సిద్దయ్య, నారాయణ, రాఘవులు, దుర్గాప్రసాద్, సుదర్శన్, ప్రభాకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, నితిన్, సత్యం, ఎలక్ట్రానిక్ మీడియా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉమామహేశ్వరి, కెమెరామెన్లు, ఫొటోగ్రాఫర్లు, వివిధ పత్రికల ప్రతినిధులు, పాత్రికేయులు పాల్గొన్నారు.



కడప కలెక్టరేట్ ఎదుట నిరసన తెలియజేస్తున్న జర్నలిస్టులు

మహిళల రక్షణకు ఫాస్ట్ ట్రాక్ కోర్టులు అవసరం

- నిరసనలో ఐద్వా నాయకుల డిమాండ్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మహిళల రక్షణకు ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఐద్వా జిల్లా కన్వీనర్ భాగ్యమ్మ తెలిపారు. సోమవారం స్థానిక సిడిపిఒ కార్యాలయం వద్ద అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ చేపట్టిన ధర్నా కార్యక్రమంలో భాగంగా గుర్రంకొండ మండలం, ప్యారంపల్లిలో ప్రేమ పేరిట జరిగిన యాసిడ్ దాడిని ఐద్వా మహిళా సంఘం జిల్లా కన్వీనర్ భాగ్యమ్మ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సైకో గణేష్‌కు ఎటువంటి పరిస్థితుల్లోనూ బెయిల్ ఇవ్వకూడదని ప్రభుత్వాన్ని కోరారు. ఫాస్ట్ కోర్టులు ఏర్పాటు చేసి నిందితుడిపై వేగంగా విచారణ చేసి 90 రోజుల్లోపే తీర్పు వెలువరించాలన్నారు. నిందితుడికి జీవితకాల కారాగార శిక్ష విధించి జీవితాంతం జైల్లోనే శిక్ష అనుభవించేలా తీర్పు ఇవ్వాలన్నారు. మరెవ్వరూ మహిళల జోలికి వచ్చేందుకు భయపడేలా శిక్షలు అమలు చేయాలన్నారు. ప్రభుత్వం ప్రతి మూడు నెలలకు ఒకసారి నిపుణులతో కమిటీ వేసి ఇలాంటి దురాఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వాటికి సంబంధించి నిధులు కేటాయించాలన్నారు. గౌతమి ఆరోగ్యానికి సంబంధించి అన్ని ఖర్చులు ప్రభుత్వమే భరించాలని, బాధితురాలు కోలుకున్న వెంటనే ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. మహిళలకు, పిల్లలకు రక్షణ చట్టాలను పటిష్టంగా అమలు చేసి వారి మాన, ప్రాణాలకు గట్టి భద్రత కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ నాయకులు మధురవాణి, సిఐటియు నాయకులు హరిశర్మ, ప్రభాకర్‌రెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎంన రసింహ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఐద్వా, ప్రజా సంఘాల నాయకులు

యాసిడ్ దాడి బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే 'నల్లారి'

ప్రజాశక్తి- గుర్రంకొండ

యాసిడ్ దాడిలో తీవ్రంగా గాయపడిన గౌతమి కుటుంబాన్ని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి సోమవారం ప్యారంపల్లికి వెళ్లి పరామశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌతమిపై యాసిడ్ దాడికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని పోలీసు వారిని ఆదేశించడం జరిగిందని పేర్కొన్నారు. బెంగళూరులో చికిత్స పొందుతున్న గౌతమికి ప్రభుత్వం ద్వారా పూర్తి వైద్యం ఖర్చును అందించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో మాట్లాడి తగిన సహాయ సహకారాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. గౌతమి తల్లిదండ్రులకు ఎమ్మెల్యే భరోసానిచ్చారు. కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నాయన జగదీష్, గ్రామస్తులు పాల్గొన్నారు.



గౌతమి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌రెడ్డి

ఈ హెచ్‌ఎం మా కొద్దంటూ ఎమ్మెల్యేకు విద్యార్థుల వినతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఈ హెచ్‌ఎం మాకొద్దు.. కులం పేరుతో తిడుతూ, తీవ్ర అసభ్య పదజాలం ఉపయోగిస్తూ తమను చదువుకు దూరం చేస్తోందంటూ మున్సిపల్ ఉన్నత పాఠశాల. (కోటబడి) ప్రధానోపాధ్యాయులు విజయకుమారిపై ఆ పాఠశాల విద్యార్థులు సోమవారం ఎమ్మెల్యే షాజహాన్ బాషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ తమను కులం పేరుతో తిట్టడమే కాకుండా, తీవ్ర అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని తెలిపారు. ఆదివారం సెలవు రోజు అయినందున ప్రత్యేక తరగతులకు హాజరు కాకపోవడంతో సోమవారం జరగాల్సిన ఫ్రీ ఫైనల్ పరీక్షలకు అనుమతించకుండా తమను పాఠశాల నుండి బయటకి నెట్టేశారని వారు వాపోయారు. గతంలో కూడా హెచ్‌ఎం తమను తీవ్రంగా దూశించేవారని ఇలాంటి హెచ్‌ఎం మాకొద్దు.. వెంటనే సస్పెండ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే ఈ విషయాన్ని ఆర్‌జెడి, డిఇఒలతో మాట్లాడి విచారణ చేయించి వాస్తవాలు తెలుసుకుని న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.



హెచ్‌ఎంపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేస్తున్న విద్యార్థులు

ప్రజా సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ప్రజల సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా పరిష్కరించాలన్నారు. ముఖ్య మంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారంపై నేరుగా పర్యవేక్షణ చేస్తారన్నారు. ప్రతి సమస్యను, ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్‌ను ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తుందని, కాబట్టి అధికారులందరూ ప్రాధాన్యతగా ఫిర్యాదులను నూరు శాతం పరిష్కరించాలని పేర్కొన్నారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న బియాండ్ ఎస్ఎల్ఎ దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరించాలన్నారు. సమస్యను పట్టుకొని పరిష్కారం కోసం ఎంతో ప్రయాసతో ప్రజలు అధికారుల వద్దకు వస్తారని, వారి సమస్యను సావధానంగా వినాలన్నారు. సమస్య ఏమిటి, దానిని ఎలా పరిష్కరించాలన్న విషయాలపై అధికారులకు అవగాహన ఉండాలని, చిత్తశుద్ధితో ప్రజల సమస్యలను నాణ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఎన్నో వ్యయ ప్రయాసలతో, సుదూర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రం రాయచోటికి వచ్చిన అర్జీదారులకు జిల్లా కలెక్టర్ స్నాక్స్, వాటర్ బాటిల్, టీ సౌకర్యాలను కల్పించారు. అర్జీదారులు సౌకర్యాలను వినియోగించుకొని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డిఆర్ఒ మధుసూదనరావు, ఎస్‌డిసి రమాదేవి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

మంత్రి వ్యాఖ్యలు విడ్డూరం : మున్సిపల్ చైర్మన్

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి వ్యాఖ్యలు విడ్డూరంగా ఉన్నాయని అన్నమయ్య జిల్లా రాయచోటి మున్సిపల్ పాలకవర్గ సభ్యులు (వైసిపి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు) పేర్కొన్నారు. తాము రాయచోటి పట్టణ అభివృద్ధికి సహకరించలేదని మంత్రి రాంప్రసాద్ రెడ్డి అనడం శోచనీయమన్నారు. సోమవారం రాయచోటి మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, వైస్ చైర్మన్ ఫయాజూర్ రెహమాన్ ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాయచోటి అభివృద్ధి కోసం మంత్రి రాంప్రసాద్ రెడ్డి ఎటువంటి డిపిఆర్ రెడీ చేశారో చెప్పాలని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 8 నెలల్లో రాయచోటి పట్టణానికి చేసిన అభివృద్ధి ఏంటి అని, తెచ్చిన ప్రత్యేక నిధులు ఏంటో మంత్రి చెప్పాలన్నారు. 15 ఫైనాన్స్ నిధులను దేశంలోని ప్రతి మున్సిపాలిటీకి కేంద్రం నిధులు కేటాయించడం నిరంతర ప్రక్రియ అని అన్నారు. అందులో మంత్రి గొప్పదనం ఏముందని సూటిగా ప్రశ్నించారు. రాయచోటి పట్టణ అభివృద్ధి కోసం మంత్రి వెనుక నడిచేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. గత ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే, పాలకవర్గం నిధులతో పట్టణంలో చిరు వ్యాపారులకు గేటు వసూలు లేకుండా చేశామని చెప్పారు. ప్రస్తుతం 8 నెలల నుంచి పట్టణంలో గేటు వసూలు చేస్తున్నారన్నారు. గేటు నిధులు మేం కట్టేందుకు సిద్ధమని పాలకవర్గం మొదటి సమావేశంలోనే చెప్పిందన్నారు. మీరు చెప్పినట్టు తాము వినాలా అంటూ ఆ సమావేశంలో మంత్రి రాంప్రసాద్ రెడ్డి విరుద్ధంగా మాట్లాడారని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారాజ్యంగా చిరు వ్యాపారుల నుంచి గేట్లు వసూలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఈశ్వర్ ప్రసాద్, అన్న సలీం, సాధక్ అలీ, ఫయాజ్, రౌనాక్, కొలిమిచాన్ బాషా, గువ్వల బాలాజీ, రియాజ్, సుగవాసి శ్యామ్, గౌస్ ఖాన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ ఫయాజ్‌బాషా



సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

భవన నిర్మాణానికి స్థలం కేటాయించండి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లి భవన నిర్మాణ కార్మిక సంఘ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌కు విన్నవించారు. సోమవారం అసోసియేషన్ అధ్యక్షులు జంగాల శ్రీనివాసులు, కార్యదర్శులు రెడ్డి సాహెబ్, మోహిన్ బాషా మాట్లాడుతూ మదనపల్లిలో సుమారు 25 వేల మంది భవన నిర్మాణ కార్మికులు రోజు వారి కూలీలుగా జీవనం సాగిస్తున్నారన్నారు. 1996 సంవత్సరంలో మదనపల్లి బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్ ప్రారంభించామని, అప్పటి నుండి నేటి వరకు అసోసియేషన్ కార్యాలయాన్ని అద్దె రూంలో నడుపుకొంటున్నామన్నారు. తమ ఆఫీసుకు సొంత భవనం లేదని, ఎమ్మెల్యేలు, ప్రముఖ నాయకులకు ఎన్నిసార్లు సంప్రదించి అర్జీలు ఇచ్చినా ఆఫీసు ఏర్పాటు చేసుకోవడానికి ఇప్పటి వరకు ఎవరు స్పందించి న్యాయం చేయలేదన్నారు. ఇప్పటికైనా కార్మికులపై దయపెట్టి భవన నిర్మాణ కార్మికుల ఆఫీసును నిర్మించు కోవడానికి స్థలాన్ని కేటాయించాలని సబ్ కలెక్టర్‌ను కోరామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు రామాంజులు, సభ్యులు ఎ.శ్రీనివాసులు, పంది రమణ, పి.నాగేంద్ర, అమరనాథ్, జంగాల నారాయణ పాల్గొన్నారు.

భూ బకాసురులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-ఓబులవారిపల్లె (పుల్లంపేట)

భూ బకాసురులపై చర్యలు తీసుకోవాలని సిపిఐ రైల్వేకోడూరు నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, మండల కార్యదర్శి చింతలపూడి నాగయ్య అన్నారు. సోమవారం మండల పరిధిలోని బాలిరెడ్డిపల్లెలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎర్రగుంటకోట రెవెన్యూ సర్వే నెంబర్ 1155లో 220 ఎకరాలు భూమి ఉందన్నారు. భూ బకాసురులు కొంతమంది 120 ఎకరాలు ఆక్రమించుకున్నారని తెలిపారు. బాలిరెడ్డిపల్లె దళితులు 20 సంవత్సరాల నుండి సాగు చేసుకుంటున్నారని చెప్పారు. వర్షాధార పంటలు వేసుకొని భూమిని కనిపెట్టుకొని ఉండగా కొంతమంది రాజకీయ నాయకులు సదరు భూమిని కన్నేసి ఆక్రమించుకున్నారని పేర్కొన్నారు. రెవెన్యూ అధికారులు భూ బకాసురులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తంగా ఉండి భూ బకాసురులపై కేసులు పెట్టి కఠినంగా శిక్షించాలని, భూమిని కనిపెట్టుకొని ఉన్న దళితులకు అసైన్మెంట్ కమిటీ నిర్వహించి పట్టాలు మంజూరు చేయాలని కోరారు. లేని పక్షంలో ప్రజాసంఘాలను కలుపుకొని రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయం దగ్గర నిరాహార దీక్షలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో గంగాధర్‌రెడ్డి పాల్గొన్నారు.



గుండ్ల చెరువులో జరుగుతున్న వాటర్ షెడ్ నిర్మాణం

చురుగ్గా వాటర్ షెడ్ పనులు

ప్రజాశక్తి - గాలివీడు

మండలంలోని గుండ్ల చెరువులో 15 వాటర్ షెడ్లు, సిసి పల్లిలో 10 వాటర్ షెడ్లు, గోపన పల్లెలో ఒక వాటర్ షెడ్ పనులు నిర్వహిస్తున్నారు. 2024- 25 ఆర్థిక సంవత్సరానికి గాను మే లోపు వీటి నిర్మాణాలు పూర్తి చేస్తామని, అందుకు రూ.2.80 కోట్లు వెచ్చిస్తున్నామని ఎఒ దామోదర్‌రెడ్డి పేర్కొన్నారు.సకాలంలో పనులు పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

రేపు రుణాల కోసం ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

సంబేపల్లి మండలంలో బిసి కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులను బుధవారం అన్ని బ్యాంకుల సమక్షంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ రామచంద్ర ఒక ప్రకటన విడుదల చేశారు. సంబేపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయ పరిధిలో బిసి కార్పొరేషన్ స్వయం ఉపాధి రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈనెల 19న ఉదయం 10:30 గంటలకు ఎంపిడిఒ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అభ్యర్థులు దరఖాస్తుతోపాటు కుల ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, రెండు ఫొటోలు, ఇతర సంబంధిత ధ్రువపత్రాలు తీసుకురావాలన్నారు. **గాలివీడు :** మండలానికి బిసి కార్పొరేషన్ కింద బిసి 41 యూనిట్లు, కాపు 12 యూనిట్లు, ఇడబ్ల్యుసి 4 యూనిట్ల గాను 512 దరఖాస్తులు అందాయని, ఈనెల 19న ఇంటర్వ్యూలుంటాయని ఎంపిడిఒ సి.ఎ. జవహర్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు స్థానిక ఎంపిడిఒ సభ భవనంలో బ్యాంకర్స్ అందుబాటులో ఉండి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. బిసి కార్పొరేషన్ కింద దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరూ ఇంటర్వ్యూలకు హాజరు కావాలని పేర్కొన్నారు.



రక్తదానం గురించి వివరిస్తున్న అబూబక్కర్ సిద్దిక్

రక్తదానం ప్రాణదానంతో సమానం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పట్టణంలోని స్థానిక మధుర మీనాక్షి డిగ్రీ కళాశాలలో హెల్పింగ్ మైండ్స్ ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదాన శిబిరంలో 33 మంది విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. వంద మంది విద్యార్థినులకు ఉచిత రక్త వర్గీకరణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబక్కర్ సిద్దిక్ మాట్లాడుతూ రక్తం కొరత లేకుండా ఏ ప్రాణం పోకూడదని రక్తదానంపై అవగాహన మరియు రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమ నిర్వహణకు బి.కొత్తకోట సంస్థ సభ్యులు ఫయాజ్, ఆరిఫ్ ఎంతో కృషిచేశారని పేర్కొన్నారు. మధుర మీనాక్షి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రమేష్ బాబు మాట్లాడుతూ చదువుతోపాటు సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ జావేద్, ప్రిన్సిపల్ పి.రమేష్ బాబు, వైస్ ప్రిన్సిపల్ రేష్మ, అధ్యాపక బృందం హెల్పింగ్ మైండ్స్ సభ్యులు ఫయాజ్, ఆరిఫ్, శీను, విష్ణు, సుమంత్, శ్రీదేవి, ఇంతియాజ్, ఉస్మాన్ పాల్గొన్నారు.

పేరు మార్పు

దండు రిజ్వాన్ అను నేను నా పేరు మార్చుకుంటున్నాను. తండ్రి దండు ముస్తఫా, ఇంటి నెంబర్ 1-93, బాగంపల్లి కస్బా, టి.సుండుపల్లి మండలం, అన్నమయ్య జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రములో నివాసం ఉంటున్నాను. నేను ఇప్పటి వరకు దండు రిజ్వాన్‌గా వాడుకలో ఉన్న నా పేరును షేక్ రిజ్వాన్‌గా మార్చుకున్నాను.ఇక నుండి నా పేరు షేక్ రిజ్వాన్ గమనించగలరు.

ఎస్‌సి, ఎస్‌టిల సమస్యలకు తక్షణ పరిష్కారం : ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచే ఎస్‌సి, ఎస్‌టి, బడుగు బలహీన వర్గాలకు అండగా నిలుస్తూ వస్తోందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. సోమవారం మండల కేంద్రమైన నిమ్మనపల్లిలోని పెద్దమాదిగపల్లె వద్ద ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షులు రెడ్డినారాయణ, ఇతర దళిత సంఘాల నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఎంఎస్‌పి రాష్ట్ర నాయకులు నరేంద్రతో కలసి ఎమ్మెల్యే ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నరేంద్ర మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్ ఎస్‌సి, ఎస్‌టిల ఓట్లను దండుకొని వారిని అన్ని విధాల అరాచకాలకు గురిచేస్తూ అనగదొక్కారన్నారు. చివరకు ఎస్‌సి, ఎస్‌టిల ప్రాణాలు సైతం తీసివేయడం ప్రజలందరూ గమనించారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గతంలోనూఎస్‌సి, ఎస్‌టిలకు రిజర్వేషన్లను కల్పించి కార్పొరేషన్ల ద్వారా నిధులను అందిస్తూ వారి జీవనోపాధికి తోడ్పాటును అందించారన్నారు. 30 ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నిర్విరామంగా పోరాటాలు సాగించి సుప్రీం కోర్టు ద్వారా ఎస్సీ వర్గీకరణ బిల్లును సాధించడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలో కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎస్సీ వర్గీకరణపై కమిషన్ ఏర్పాటు చేశారని, త్వరలోనే ఎస్సీ వర్గీకరణ అమలు కావడం జరుగుతుందన్నారు. నిమ్మనపల్లెలో అంబేద్కర్ భవనం ఏర్పాటు చేయాలని, టిటిడి కల్యాణ మండపాన్ని ఏర్పాటు చేయాలని, స్థానిక బస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహాన్ని ఆధునికరించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సచివాలయంలో సమస్యలపై వచ్చే ప్రజల పట్ల ఉద్యోగులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వారి వ్యవహార శైలిలో మార్పు రావాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కూడా పెద్దమాదిగపల్లెకు ప్రత్యేకంగా రూ.80 లక్షల నిధులను మంజూరు చేసి కమ్యూనిటీ హాల్, సిసి రోడ్లు, అంగన్‌వాడీ భవనాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. అంబేద్కర్ భవనానికి స్థలాన్ని తక్షణం ఏర్పాటు చేయాలని రెవెన్యూ అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. స్థల పరిశీలన అనంతరం అంబేద్కర్ భవన నిర్మాణానికి రూ.50 లక్షల నిధులను మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. టిటిడి కల్యాణ మండపాన్ని ఏర్పాటు చేయడానికి, దళితుల నివాస ప్రాంతాలలోని ఆలయాల ఏర్పాటుకు టిటిడి అధికారులతో నేరుగా చర్చించి చర్యలు చేపడతానన్నారు. స్థానిక బస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహాన్ని మండల పరిషత్ నిధులతో సుందరీకరణ చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపిడిఒకు ఆదేశించారు. సచివాలయంలో ఉద్యోగులు ప్రజల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, ప్రతి అధికారి ప్రజలతో గౌరవంగా వ్యవహరించాలని, లేదంటే తక్షణం ఆ అధికారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బడుగు, బలహీన వర్గాల ప్రజల ఆశీస్సులు భవిష్యత్తులో కూడా తెలుగుదేశం పార్టీపై, కూటమి ప్రభుత్వంపై ఉండాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రెడ్డి నారాయణ, రెడ్డి ప్రసాద్, శ్రీనివాసులు, రాజశేఖర్, వెంకటరమణ, జయన్న, రాజన్న, సర్పంచులు సుబ్రమణ్యం, పాపులమ్మ మల్లప్ప, శ్రీవాణి నవీన్, రెడ్డప్ప, టిడిపి నాయకులు పుర్రా వెంకటరమణ, రాజన్న, రెడ్డప్ప రెడ్డి, శ్రీపతి, మాజీ జడ్‌పిటిసి సుజాత, సుధాకర్ రావు, మల్లికార్జున, రఫీ, ఎంపిడిఒ పరమేశ్వర్‌రెడ్డి, ఎంఇఒ పద్మావతి, ఎపిఎం మురళి, ఎపిఒ రమేష్, రెవెన్యూ, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ముఖ్యం : 'చమర్తి'

ప్రజాశక్తి-వీరబల్లి

కూటమి ప్రభుత్వానికి గ్రామపంచాయతీలో వ్యక్తిగత ప్రతిష్ట కంటే గ్రామాల అభివృద్ధే ముఖ్యమని రాజంపేట పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్‌రాజు తెలియజేశారు. సోమవారం ఓదివీడు గ్రామంలో పర్యటిస్తూ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కూటమి ప్రభుత్వ హయాంలో చంద్రన్న సారథ్యంలో మండలంలో ఓదివీడు కస్బాలో నిర్మించిన మినీ గోకులాలను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఓదివీడు కస్బాకు రూ.5 లక్షలు. ఎర్రం రాజుగారి పల్లెకు రూ. 3.5 లక్షలతో సిమెంట్ రోడ్లకు భూమి పూజ చేశారు. అనంతరం మినీ గోకులాలు ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు భానుగోపాల్‌రాజు. టిడిపి సీనియర్ నాయకులు రెడ్డప్ప రెడ్డి, మట్లి సర్పంచ్ నాగార్జునచారి, సురేంద్రారెడ్డి, రాజా నాయుడు, భూషణయ్య నాయుడు, ఓదివీడు సుధాకర్, బిసి నాయకులు చలపతి, రామచంద్ర, శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ వెంకట రామరాజు. గ్రామ టిడిపి అధ్యక్షుడు సిద్ధిరాజు, రాచరాయుడు, రాజేంద్ర, నందకుమార్ నాయుడు, నాగ సుబ్బయ్య నాయుడు, మాజీ సర్పంచ్ వెంకటరమణ, భాస్కర్ రాజు, దుర్గం ఆంజనేయులు, రవిరాజు, పంచాయతీరాజ్ ఎఇ నాగుల్ మీరా, ఎపిఒ నాగరాజా, పంచాయతీ సెక్రెటరీ పద్మజ, పశు వైద్యాధికారి నాగరాజ, పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



సిసి రోడ్డుకు భూమిపూజ చేస్తున్న జగన్‌మోహన్‌రాజు

కార్యకర్తలకు అండగా ఉంటాం : 'గడికోట'



నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి-రామాపురం

పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటామని సోమవారం వైసిపి ప్రధాన కార్యదర్శి, మాజీ శాసనసభ్యులు గడికోట శ్రీకాంత్‌రెడ్డిపార్టీ కష్ట కాలంలో అండగా నిలిచిన నాయకులు కార్యకర్తలు భరోసా కల్పిస్తూ మండలంలోని హసనాపురం చెట్లూరు గ్రామాలలో ఆయన సుడిగాలి పర్యటన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన హసనాపురం పంచాయతీ కొండవాళ్ళపల్లిలో తాడిగుంట భాస్కర్‌రెడ్డి సతీమణి లక్ష్మీ ప్రసన్న ఇటీవల మృతి చెందారు గొల్లపల్లిలో పప్పిరెడ్డి పాపిరెడ్డి చీకటి వాండ్లపల్లి చీకటి రామచంద్ర, చిట్లూరు పంచాయతీ పాలనగారిపల్లిలో వెంకటరామిరెడ్డి తల్లులు మరణించడంతో వారి ఇళ్లకు వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చి పరామర్శించారు. పప్పిరెడ్డిగారిపల్లెలో కాలికి దెబ్బ తగిలి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న రవీంద్ర రెడ్డిని, అనారోగ్యంతో బాధపడుతున్న సుధాకర్ రెడ్డిని పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. రెండు పంచాయతీలలో రైతులు ప్రజలతో కలిసి కష్టసుఖాలు తెలుసుకున్నారు వర్షాలు లేక కరువు పరిస్థితులు ఏర్పడబోతున్నాయని, పంటలు చేతికొచ్చే పరిస్థితిలో బోర్లలో నీరు మట్టం తగ్గిపోయి పంటలు ఎండిపోయాయని రైతులు ఆయన దృష్టికి తెచ్చారు. వేరుశనగ పంట పూర్తిగా దెబ్బతినిందని ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కరువు రైతు పరిస్థితులను అధికారుల దృష్టికి తీసుకెళ్తారని ఆయన అన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు రవి శంకర్ రెడ్డి, సర్పంచ్ రామాంజులు, హసనాపురం మాజీ సర్పంచ్ రాజారెడి, వైసిపి నాయకులు రిటైర్డ్ లెక్చరర్ ఈశ్వర్‌రెడ్డి, చలమారెడ్డి, నాగేందర్‌రెడ్డి, ఎస్‌సి, ఎస్టఇ జిల్లా మానిటరింగ్ మాజీ సభ్యులు సగినాల శివ శంకర్, సోమేశ్వర్ రెడ్డి, ఆదిరెడ్డి నారాయణరెడ్డి, ఆంజనేయరెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, రంగారెడి, వెంకట సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

'బుద్ధుడికొండ అభివృద్ధికి ప్రభుత్వ సాయం కోరుతాం'

ప్రజాశక్తి మదనపల్లె అర్బన్

బుద్ధుడికొండ అభివృద్ధికి సిఎం సాయం కోరుతామని ఇంటర్నేషనల్ బిక్కు సంఘం ప్రతినిధులు తెలిపారు. ఇంటర్నేషనల్ బిక్కు సంఘం, సౌత్ ఇండియా బ్రాంచ్ ప్రతినిధులు సోమవారం మదనపల్లెకు విచ్చేశారు. ఈ సందర్భంగా వీరు బుద్ధ అంబేద్కర్ సమాజ్ ఫౌండర్ ట్రస్టీ ఉపాసక పిటిఎం శివప్రసాద్‌తో కలిసి మదనపల్లె రూరల్ మండలం, అంకిశెట్టిపల్లి వద్దనున్న బుద్ధుడికొండను సందర్శించారు. ఈ సందర్భంగా ఇంటర్నేషనల్ బిక్కు సంఘం ప్రతినిధులు భంతే సద్దారక్కిత (తెలంగాణ), డాక్టర్ నాగభూషణం భంతే (ఉత్తరప్రదేశ్), భంతే నాగరత్న (కర్ణాటక) బుద్ధుడికొండ విహారలోని బోధి వృక్షానికి, భగవాన్ బుద్ధుడి విగ్రహానికి పూజలు నిర్వహించి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం వీరు మాట్లాడుతూ ప్రకృతి సిద్ధమైన ఎన్నో సౌందర్యాలతో కనువిందు చేసి, ఆధ్యాత్మిక శోభతో మానసిక వికాసం కలిగించి, పంచశీల పరివర్తన పీఠంగా చరిత్ర పుటల్లో నిలిచిపోయే గొప్ప క్షేత్రం బుద్ధుడికొండ అని స్పష్టం చేశారు. బుద్ధుడికొండ అభివృద్ధికి సాయం కోరేందుకు త్వరలోనే ఇంటర్నేషనల్ బిక్కు సంఘం తరపున తాము ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలుస్తామని తెలిపారు. ఇంటర్నేషనల్ బిక్కు సంఘం కూడా బుద్ధుడికొండ అభివృద్ధికి సహకారం అందిస్తుందని, సమాజ హితైభిలాషులు కూడా సహాయ సహకారాలు అందజేయాలని విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో పురాతన బౌద్ధ విహారాలు చాలా వరకూ శిథిలావస్తలో ఉండగా, నూతనంగా మరికొన్ని విహారాలు నిర్మాణంలో ఉన్నాయని, వీటి అభివృద్ధికి ప్రభుత్వం ఆర్థిక సహకారం అందిస్తే, ఆంధ్రప్రదేశ్ ఇంటర్నేషనల్ టూరిస్ట్ ప్రదేశ్‌గా అభివృద్ధి వైపు పరుగులు పెడుతుందని బిక్కు సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. **'ధమ్మసభ'కు విచ్చేయండి :** ఈ నెల 23న బెంగళూరు సిటీ సదాశివ నగర్‌లోని నాగసేన బుద్ధ విహార్‌లో ఇంటర్నేషనల్ బిక్కు సంఘం, సౌత్ ఇండియా బ్రాంచ్ ఆధ్వర్యంలో 'ధమ్మ సభ' నిర్వహిస్తున్నామని, ప్రపంచ వ్యాప్తంగా బౌద్ధ భిక్షువులు హాజరవుతున్న ఈసభకు బౌద్ధ ఉపాసిక, ఉపాసకులు, బౌద్ధాభిమానులు పెద్దసంఖ్యలో విచ్చేసి, విజయవంతం చేయాలని బిక్కు సంఘ ప్రతినిధులతోపాటు పిటిఎం శివప్రసాద్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ రఘునాథ్, ట్రస్ట్ సభ్యులు నీరుగట్టి రమణ, చాట్ల బయన్న, తలారి కృష్ణ, బురుజు జనార్దన్, నీరుగట్టి రాజేష్, సి.కళ్యాణ్, బైనేని సురేష్, శరత్ కుమార్, శివప్రసాద్ కుటుంబ సభ్యులు శంకరమ్మ, పృథ్వీరాజ్ పాల్గొన్నారు.



బుద్ధుడికొండ సందర్శించిన బిక్కు సంఘం ప్రతినిధులు

'కూటమి'లోనే మహిళలకు భద్రత

- టిడిపి రాజంపేట పార్లమెంట్ మహిళ ఉపాధ్యక్షులు వాణి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్



రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం వల్లే మహిళలకు భద్రత ఉంటుందని టిడిపి రాజంపేట పార్లమెంట్ మహిళ ఉపాధ్యక్షులు దాసరిరాజు వాణి పేర్కొన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి కొన్ని నెలలైనా చెప్పిన ప్రతి హామీని ఒక్కొక్కటిగా నెరవేరుస్తుందని చెప్పారు వైసిపి రాక్షస పాలనలో బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఎన్నో సమస్యలు ఎదుర్కొన్న పరిస్థితులు చూసామని గుర్తు చేశారు. నేడు కూటమి ప్రభుత్వంలో మహిళలకు పెద్దపీట వేస్తూ నామినేటెడ్, ఇతర పోస్టులకు సంబంధించి మహిళలకు అత్యున్నత స్థానం కల్పిస్తున్నారని తెలిపారు. మహిళలను కించపరిచే విధంగా గత ప్రభుత్వంలో వైసిపి ఎంపీ చేసిన దురాగతం మనం చూసిందేనని, దళిత డ్రైవర్ చంపి డోర్ డెలివరీ చేసిన వైసిపి ఎమ్మెల్సీ ఘనత చూశామని పేర్కొన్నారు. దిశ పోలీస్ స్టేషన్ ప్రారంభించిన రోజే ఆ స్టేషన్‌కు కొద్ది మీటర్ల దూరంలోనే ఒక యువతిపై జరిగిన అఘాయిత్యం ఇప్పటికీ మర్చిపోలేకపోతున్నామని తెలిపారు. మరో వైసిపి మంత్రి గంట, అరగంట అంటూ వ్యాఖ్యలు చేసి అమ్మాయిలను, మహిళలను కించపరిచే విధంగా, మహిళల మనోభావాలు దెబ్బతీసే విధంగా ప్రవర్తించిన తీరును కూడా మనం చూశామని అన్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే గత ప్రభుత్వ తాలూకు ఎన్నో దుర్మార్గపు చేష్టలు మనం చెప్పుకోవాల్సి వస్తుందన్నారు. ఎక్కడైనా ఏదైనా సంఘటన జరిగితే దానికి కారణం ప్రభుత్వంపై వేయడం నాగరికతగా మారిపోయిందన్నారు. వైసిపి మండల, జిల్లా, రాష్ట్ర మహిళా నాయకురాలు మైకు ముందుకు రాగానే ఏదో పూనకం వచ్చినట్టు అర్థం పర్థం లేని వ్యాఖ్యలు చేస్తూ కొత్త రకం హాస్య రాజకీయాలకు తెరలేపుతున్నారని అన్నారు. మహిళలకు భద్రత, రక్షణ కల్పించే ఏకైక ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని తెలియజేస్తూ, వాస్తవాలు తెలియకుండా శవ రాజకీయాలు మానుకోవాలని ఆమె హితవు పలికారు.



అవార్డు అందుకుంటున్న మునిగోపాల కృష్ణ దంపతులు

మునిగోపాలకృష్ణకు శ్రీకృష్ణదేవరాయ అవార్డు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సోషల్ సర్వీసెస్, ప్రజా సేవలు, వయోవృద్ధులకు అందిస్తున్న సేవలను గుర్తిస్తూ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్.మునిగోపాల కృష్ణకు శ్రీకృష్ణదేవరాయ అవార్డును తిరుపతి మహతిలో సిఇఒ డాక్టర్ కె.వెంకటరావు ఆధ్వర్యంలో ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎన్.మునిగోపాల కృష్ణ, ధవలక్ష్మి దంపతులను శాలువ, పుష్పగుచ్ఛం, జ్ఞాపిక, శ్రీకృష్ణదేవరాయల కాంస్య విగ్రహం, శ్రీక మెడల్, అవార్డు సర్టిఫికెట్, కిరీట ధారణతో ఘనంగా సన్మానించి, వారు నిస్వార్థంగా అందిస్తున్న సేవలను ప్రశంసించారు. ఈ వేడుకను పురస్కరించుకొని ప్రొఫసర్ శ్రీనివాసులు, డాక్టర్ గొల్లపూడి తిరుపతిరావు, డాక్టర్ మునిరత్నమయ్య, ఢిల్లీ యూనివర్శిటీ ప్రొపెసర్ డాక్టర్ చంద్రశేఖర్, సెక్రటరీ కరుణాకర్, కోశాధికారి ఉస్మాన్ సాహెబ్, ఉపాధ్యక్షులు జగన్ మోహన్, ఆర్గనైజర్ కృష్ణమూర్తి, నాగరాజ, నవల రచయిత టిఎస్‌ఎ కృష్ణమూర్తి ముని గోపాలకృష్ణ దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మునిగోపాల కృష్ణ మాట్లాడుతూ తమ సేవలను గుర్తించి అవార్డు ప్రదానం చేయడం వెనక మీ అందరి సహాయ, సహకారాలు ఉండటం వల్లనే సాధ్యమైందన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతానని, మీ అందరి సహాయ, సహకారాలు అందించాలని ఆకాంక్షించారు.

రేపు రామాపురం మండల సమావేశం

ప్రజాశక్తి-రామాపురం

స్థానిక మండల ప్రజా పరిషత్ సభ మందిరంలో ఈనెల 19న ఉదయం 10 గంటలకు ఎంపిపి విజయలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ జాషువా ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో రాబోవు వేసవిలో గ్రామాలలో తాగునీటి సమస్య, ఉపాధి పనులు, పారుశుధ్యం, పంచాయతీ రాజ్, ఆరోగ్యం, విద్య, విద్యుత్, హౌసింగ్, వ్యవసాయం అనుబంధ శాఖలో ఉద్యానవన శాఖ, పశుసంవర్ధక శాఖ, సిరికల్చర్, మాతా, శిశు సంక్షేమ శాఖ, మైనర్ ఇరిగేషన్, రోడ్డు రవాణా శాఖ తదితర శాఖలపై సమీక్ష చేస్తామన్నారు. ఆయా శాఖల మండల స్థాయి అధికారులు పూర్తి నివేదికలతో సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

మామిడి పండ్ల కవర్ల వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి-రామాపురం

ఉద్యానవ శాఖ అధికారి టి.నాగమణి ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని నల్లగుట్టపల్లి గ్రామంలో మామిడి రైతులకు మామిడి పండ్లకు కవర్ల వినియోగంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మామిడికాయలు పెద్ద నిమ్మకాయ సైజు రాగానే కాయకు కవర్లు తొడగడం వల్ల కాయ నాణ్యంగా ఉంటుందన్నారు. ఎగుమతి చేయడం వల్ల అధిక ధర లభిస్తుందని తెలిపారు. పండు ఈగ కాయ తెగులు పురుగులను నివారించుకోవచ్చని పేర్కొన్నారు. మామిడికాయలను ఎక్కువకాలం చెట్టుపైనే నిల్వ చేసి మంచి ధర వచ్చినప్పుడు అమ్మకానికి వీలవుతుందని వివరించారు. మామిడికాయలకు కవర్లు ఎకరానికి 4 వేలు అవసరమవుతాయన్నారు. రైతుకు 50 శాతం సబ్సిడీతో ఉద్యాన శాఖ రూ. 4 వేలకే అందజేస్తుందన్నారు. మామిడి రైతులు తమ గ్రామాల్లోని రైతు సేవ కేంద్రం సహాయకులను సంప్రదించి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో మండల వ్యవసాయ అధికారి వై.నాగమణి, రైతు సేవా కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే, విద్యార్థులు

పెరిగిపోతున్న వాతావరణ కాలుష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి -మదనపల్లె అర్బన్

భూమాతను రక్షించుకోవాల్సిన ఆవశ్యకత, యుద్ధాల వల్ల కలిగే అనర్థాలు విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎమ్మెల్యే షాజహాన్ బాషా సూచించారు. ప్రయివేటు విద్యా సంస్థల ఆధ్వర్యంలో సేవ్ ఎర్త్-నోవార్ అవగాహన కార్యక్రమాన్ని సోమవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం విపరీతంగా పెరిగిపోయిన సాంకేతిక పరిజ్ఞానం వల్ల లాభాల కంటే నష్టాలే ఎక్కువగా ఉన్నాయన్నారు. రోజు రోజుకు పెరిగిపోతున్న వాతావరణ కాలుష్యంతో మానవాళి మనుగడకు ముప్పు ఏర్పడుతోందన్నారు. విపరీతంగా బోర్లు వేయడం, భూతాపం పెంచే కార్యక్రమాలతో అపారమైన నష్టం వాటిల్లే ప్రమాదం ఎర్పడుతోందన్నారు. యుద్ధాల వల్ల అనేక నష్టాలు జరుగుతాయన్నారు. ఇటీవల రష్యా-ఉక్రేయిన్ దేశాల మధ్య జరిగిన యుద్ధంలో వేలాది మంది మృతి చెందడంతో పాటు అపార నష్టం వాటిల్లడమే ఇందుకు నిదర్శనమన్నారు. నేటి యువత మత్తు పదార్థాలకు దూరంగా వుండాలని సూచించారు. మత్తు పదార్థాల కారణంగా విచక్షణ కోల్పోయి ప్రవర్తిస్తున్నారని దీనివల్ల ఎన్నో దుష్పరిణామాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. అనంతరం పట్టణంలో విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో విజయభారతి హైస్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.సేతు, జ్ఞానాంబిక కాలేజ్ కరస్పాండెంట్ రాటకొండ గురుప్రసాద్, పోర్డు లలితమ్మ, చైతన్య సర్వీస్ సొసైటీ కవితా రాణి, జ్ఞానోదయ హైస్కూల్ కామకోటి ప్రసాదరావు, టిడిపి నాయకులు బాలు స్వామి, బొమ్మిశెట్టి పురుషోత్తం, బీదం గురునాథ్ యాదవ్, తమ్మిశెట్టి రామకృష్ణ, గౌస్ ఆజాం, బాబా, పూలకుంట్ల హరిబాబు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సబ్సిడీ రుణాలు

ప్రజాశక్తి-ములకలచెరువు : అర్హులైన ప్రతి ఒక్కరికీ కార్పొరేషన్ల ద్వారా అందిస్తున్న సబ్సిడీ రుణాలు అందించాలని జిఎస్‌ఎన్‌సి రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు కబ్జా దొరస్వామి నాయుడు, మండల టిడిపి నాయకులు పాలగిరి సిద్ధ ఎంపిడిఒ హరినారా యణను కోరారు. సోమవారం ఎంపిడిఒ కార్యాలయంలో వారు కలిసి సబ్సిడీ రుణాలపై చర్చించారు. మండలానికి 53 యూనిట్లు మంజురయ్యాయని వాటిని అర్హులైన వారికి మాత్రమే ఇవ్వాలన్నారు. అనర్హులకు ఇచ్చినట్లు తమ దృష్టికి వస్తే సహించమన్నారు గత వైసిపి పాలనలో టిడిపి నాయకులను వైసిపి నాయకులు టార్గెట్ చేసి కేసులు బకాయించి ఇబ్బందులకు గురిచేశారన్నారు. ఈ నెల 18న జరిగే దజాల ఇంటర్వ్యూల్లో అర్హులైన వారికి మాత్రమే ఇవ్వాలని అనర్హులకు ఇవ్వరాదని కోరాడు. గోకులం షెడ్లు కూడా పార్టీ కోసం పనిచేసిన వారికి దక్కేలా చూడాలన్నారు. అనంతరం ఎంపిడిఒ మాట్లాడుతూ అర్హులైన వారందరికి రుణాలు దక్కే విదంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు కేశవులు, చెన్నకృష్ణ, రెడ్డిప్ప, ప్రకాష్ వెంకటస్వామి నాగేంద్ర, భాస్కద్నాయుడు పాల్గొన్నారు.

కారు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - నందలూరు

కడప- చెన్నై ప్రధాన రహదారిలోని నందలూరు బస్టాండ్ కూడలి వద్ద సోమవారం సాయంత్రం బైకును కారు ఢీకొన్న సంఘటనలో ఇద్దరు తీవ్ర గాయాల పాలయ్యారు. మాధవరం నుండి తాళ్లపాకకు బైకుపై వెళ్తున్న కమ్మినేని ప్రసాద్, శ్రీకళ దంపతులను కడప నుండి రాజంపేటకు వెళ్తున్న కారు ఢీకొనడంతో బైక్‌పై వెళ్తున్న దంపతులకు తీవ్ర గాయాలు కావడంతో పాటు ప్రసాద్ అపస్మారక స్థితిలోకి వెళ్ళాడు. క్షతగాత్రులను రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి 108 వాహనంలో తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించారు. ఈ సంఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.